రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 26: ఈనెల 28 నుంచి జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు tsbie.cgg.gov.in వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి పరశురాం తెలిపారు. విద్యార్థులు నేరుగా హాల్ టికెట్‌ను డౌన్లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావచ్చునన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు.

ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం ఈ విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలు కల్పిస్తున్నామని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులానికి చెందిన విద్యార్థులకు పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. 1.6.2017 నుంచి 31.5.2018 వరకు జన్మించిన వారు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారు రూ.2లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.లక్షా50వేల ఆదాయం ఉన్నవారు ఈనెల 12లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 26 : 2022–23 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు జిల్లాకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం వారిని అభినందించారు. ఆత్రం శ్రీకాంత్, గోలి రాజ్‌కృష్ణ, మగ్గిడి అన్వేశ్, శేక్‌సబాద్, తోట దివ్య, శేక్‌అవేశ్, వెంపల్లి స్పందన, ప్రేమ స్పందన, ఆకుల విఘ్నేష్, ఎం మనోజ్ ఎంపికయ్యారని డీఈవో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వీరికి ప్రతినెలా రూ.10వేల నగదు డిపాజిట్ చేయనున్నట్లు వివరించారు. వీరిని జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి,26: నిర్మల్ ఐకేపీ మెప్మా డీఎంసీ సుభాష్ అవినీతిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు కలిసి కమిషనర్ సీవీఎన్ రాజుకు ఫిర్యాదు చేశారు. అధికారిపై పూర్తి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కుంటాల: పెంచికల్‌పాడ్‌లో విగ్రహమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- జిల్లాలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు, జాతరలు, బీరప్ప కామరాతి కల్యాణం

జిల్లాలో సోమవారం ఆలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సోన్ మండలం కడ్తాల్‌లో పెద్దమ్మ తల్లి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. నిర్మల్ మండలంలోని ముజ్గి మల్లన్న స్వామి జాతరలో భాగంగా నాల్గోరోజు మల్లన్నస్వామికి నాగవెల్లి నిర్వహించారు. ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్‌లో రెండు రోజులుగా నూతన శివ లింగవిగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో బీరప్ప కామరాతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది.

సోన్, ఫిబ్రవరి 26 : కడ్తాల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించారు. అన్నదానం చేశారు. ఇక్కడ నిర్వాహకులు, గ్రామస్తులు ఉన్నారు.

మల్లన్న ఆలయంలో నాగవెల్లి

సోన్, ఫిబ్రవరి 26 : నిర్మల్ మండలంలోని ముజ్గి మల్లన్న స్వామి జాతరలో భాగంగా నాల్గోరోజు మల్లన్నస్వామికి నాగవెల్లి నిర్వహించగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మల్లన్న స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

భైంసా టౌన్ : బీరప్ప కామరాతి కల్యాణంలో పాల్గొన్న గ్రామస్తులు

ఖానాపూర్ రూరల్ : ఆలయంలో లింగ మహార్చనలో పాల్గొన్న గ్రామస్తులు

శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 26 : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్‌లో రెండు రోజులుగా నూతన శివ లింగవిగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నాగ సుబ్రహ్మణ్య విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యజ్ఞాలు, హోమాలు, మహలింగార్చన హరతి చేశారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 28 వరకు కొనసాగుతాయి. ఇక్కడ మాజీ సర్పంచ్ నాగమ్మ, చిలుకూరి మల్లయ్య, దొనికెని దయానంద్, బాశెట్టి నర్సయ్య, అడిదెల మల్లేశం, విజేందర్, వెంకట్రాములు, శివ, మదు, నితిన్, మహేశ్, లక్ష్మణ్, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం

భైంసా టౌన్, ఫిబ్రవరి 26 : మండలంలోని దేగాం గ్రామంలో నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం బియ్యం సుంకు, డోలు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య కురుమ సంఘం సభ్యులు బీరప్ప ఆలయానికి చేరుకున్నారు. ఆదివారం లింగాలకు గంగస్నానం చేయించి ఆలయానికి తీసుకవచ్చారు. ఆలయ ఆవరణలో బీరప్ప కామరాతి కల్యాణం జరిపించారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కురుమ సంఘం సభ్యులు, ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సోన్ : అన్నదానంలో పాల్గొన్న భక్తులు

భైంసా టౌన్ : ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

విగ్రహమూర్తుల ఊరేగింపు

కుంటాల, ఫిబ్రవరి, 26: పెంచికల్‌పాడ్‌లో సోమవారం శివ పంచాయతన మహాదేవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటిరోజు వేద పండితుడు సంజయ్ శర్మ ఆధ్వర్యంలో శివమూర్తుల ఊరేగింపుతోపాటు మహా గణపతి పూజ, పంచగవ్య సంస్కారం, రక్షాబంధనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ కలశ స్థాపన పూజ, అగ్నిప్రతిష్ఠ లక్ష్మీ గణపతి హవనం తదితర పూజలు నిర్వహించారు.

కుస్తీ పోటీలను తిలకించిన ఎమ్మెల్యే

బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, ఫిబ్రవరి 26 : మండలంలోని ఎడ్‌బిడ్ మల్లన్న జాతరలో భాగంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తిలకించారు. గెలిచిన మల్లయోధులకు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తిభావంతో మల్లన్న జాతర నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు శాలువాతో సత్కరించారు. ఇక్కడ నాయకులు రవీందర్ రెడ్డి, దత్తు, ఎంపీటీసీ లక్ష్మీనారాయణతోపాటు తదితరులు ఉన్నారు.

డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రోగులను డయాలసిస్ సేవలపై అడిగి తెలుసుకుంటున్న కౌన్సిలర్ రాజురా సత్యం

ఖానాపూర్ టౌన్, ఫిబ్రవరి 26 : ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ రాజురా సత్యం కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను నాయకులతో కలిసి సందర్శించారు. రోగులు, కిడ్నీ బాధితులకు డాక్టర్లు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కావాలి సంతోశ్, నాయకులు శంకర్, అమానుల్లాఖాన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రతిభతోనే ఉన్నత శిఖరాలకు

శివరాజ్‌ను అభినందిస్తున్న ఈవో

బాసర, ఫిబ్రవరి 26 : ఉద్యోగి తన విధి నిర్వహణలో చూపే ప్రతిభ, సమయస్ఫూర్తి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ ఈవో విజయరామరావు అన్నారు. సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ శివరాజ్‌ను ఆయన సోమవారం అభినందించి మాట్లాడారు. ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కుబీర్ : కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కుప్రే రాజన్న

కుబీర్, ఫిబ్రవరి 26 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీ వంద రోజులు పనిని తమ హక్కుగా భావించి సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కుప్రే రాజన్న సూచించారు. సోమవారం మండలంలోని పల్సి గ్రామంలో ప్రారంభమైన ఉపాధిహామీ పనులకు హాజరైన కూలీలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎఫ్ఏలు, టీఏలు సైతం చేసిన పనులకు త్వరలో డబ్బులు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొట్టె హన్మాండ్లు, వీడీసీ అధ్యక్షుడు రమేశ్, సబ్బిడి రాజు, టీఏ సంతోష్, ఎఫ్ఏ, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

చందు (ఫైల్)

కుంటాల, ఫిబ్రవరి 26 : అప్పుల బాధతో ఓ యువకుడు ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ దేవురావు తెలిపిన వివరాల వివరాల ప్రకారం.. కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పొన్నవేని చందు (26) భార్య శస్త్ర చికిత్స కోసం అప్పు లు చేశాడు. ఈక్రమంలో కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. చందుకు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవురావు తెలిపారు.

ప్రజలు గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలి

దస్తురాబాద్, ఫిబ్రవరి 26 : ప్రజలు ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని తహసీల్దార్ నిర్వహించారు. ప్రజలు ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే రమేశ్, ఎంపీవో అనిల్ కుమార్, ఏపీఎం గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, వెటర్నరీ అసిస్టెంట్ దేవీదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ ఉత్తమ మెంటర్ అవార్డుకు ఎంపిక

భైంసా, ఫిబ్రవరి 26 : ఇంపాక్ట్ ఫౌండేషన్ ఉత్తమ మెంటర్ అవార్డుకు వాడేకర్ లక్ష్మణ్ ఎంపికయ్యారు. సోమవారం సికింద్రాబాద్‌లోని త్రీస్టార్ హోటల్‌లో ట్రైనర్ వర్క్‌షాప్ ఏర్పాటు చేయడంతో ఈ అవార్డును ఇంపాక్ట్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ విద్యార్థులనే కాకుండా ట్రైనర్లకు కూడా ఈ అవార్డులను అందిస్తున్నారు.

కుంటాల ఎస్ఐగా రజనీకాంత్

కుంటాల, ఫిబ్రవరి 26 : కుంటాల నూతన ఎస్ఐగా పెంబి నుంచి బదిలీపై వచ్చిన రజనీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పనిచేస్తానన్నారు. ఇందుకోసం ప్రజలు సహకరించాలని కోరారు. ఇక్కడ ఏఎస్ఐ దేవరావు, సిబ్బంది ఉన్నారు.

నీటి సమస్యల్లేకుండా చర్యలు

దస్తురాబాద్, ఫిబ్రవరి 26 : తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం పైపులైన్ మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఇక్కడ ఎంపీవో అనిల్ కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు నిమ్మతోట శివయ్య, గాజర్ల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- పరీక్షల నిర్వహణపై సమావేశం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : ఇంటర్మీడియట్ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా చూడాలని, నీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వివిధ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ వారు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు పరీక్ష హాల్లో మాస్‌కాపీయింగ్ నిరోధానికి చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీయట్ అధికారి పరశురాం, అధికారులు పాల్గొన్నారు.

రెండో దశ ఈవీఎంల తనిఖీ

సమీకృత కలెక్టరేట్ భవనంలో ఉన్న ఈవీఎం గోదాముల్లో రెండో దశ ఈవీఎంల తనిఖీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు ఫైజన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌లతో కలిసి ఈవీఎంల తనిఖీ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వారోత్సవాల సందర్భంగా పొదుపు చేయడం అలవాటు చేసుకోండి, ఆర్థిక లాభాలను ఆర్జించండి, సైబర్ స్మార్ట్ అవ్వండి అనే వాల్ పోస్టర్లను బ్యాంకు, జిల్లా అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

- జిల్లా జడ్జి కే కర్ణకుమార్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 26 : కేసుల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి కే కర్ణకుమార్ అన్నారు. జిల్లా కోర్టు కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, భూ సంబంధిత, క్రిమినల్ కేసుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జైలులో ఉన్న ట్రయల్ ఖైదీల కింద ఉన్న కేసులలో చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్వో గంగయ్య, అధికారులు పాల్గొన్నారు.

అల్లోలను పరామర్శించిన పలువురు నాయకులు

సోన్, ఫిబ్రవరి 26 : రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడు హన్మంత్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారిని సోమవారం బీఆర్ఎస్ నాయకులతోపాటు ఉద్యోగులు ఆయనను పరామర్శించారు. నిర్మల్ మండలం ఎల్లపెల్లి గ్రామంలోని తన నివాస భవనంలో పరామర్శించారు. అల్లోల హన్మంత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పరామర్శించిన వారిలో కుంటాల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ బిల్లోలి శంకర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్ యాదవ్, ధర్మాజి రాజేందర్, గోవర్ధన్‌రెడ్డి, గంగారెడ్డి, తదితరులున్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం

కుంటాల, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలో రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ సోమవారం భూమి పూజచేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మాజీ సర్పంచ్ మహేందర్, దయాకర్, బోగ లక్ష్మణ్, నరేందర్ పాల్గొన్నారు.

సోన్, ఫిబ్రవరి 26 : సోన్ మండలంలోని గంజాల్ గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ బర్ల మానస హరీశ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ ఎంపీడీవో సురేశ్, ఎంపీటీసీ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ లావణ్యానవీన్, ఉప సర్పంచ్ గంగయ్య, కార్యదర్శి సృజిత్‌రెడ్డి ఉన్నారు.

దస్తురాబాద్, ఫిబ్రవరి 26 : మండలంలోని పెర్కపల్లె గ్రామంలో సోమవారం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఉపాధిహామీ పథకం నిధులు రూ.12 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ సింగరి కిశన్ ప్రారంభించారు. ఇక్కడ వైస్ ఎంపీపీ భూక్యా రాజునాయక్, మాజీ సర్పంచ్ ముష్కె అంజన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు సంతపూరి శ్రీనివాస్, చుంచు భూమన్న, సింగరి కిశన్, ప్రసాద్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్రం కృషి

- ఎంపీ సోయం బాపూరావు

బాసర, ఫిబ్రవరి 26 : అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌తో దేశంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా చేపట్టనున్న ఆధునీకరణ పనులకు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. బాసర రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంపీ హాజరై పాల్గొని మాట్లాడారు. బాసర రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో ఎంపికైందని, రూ.11.33 కోట్లతో బాసర రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తారన్నారు. తెలంగాణరాష్ట్ర వ్యాప్తంగా రైల్వేల్లో అపూర్వమైన అభివృద్ధి సాధించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. ఈయన వెంట ఎమ్మెల్యే రాంరావుపాటిల్, సెంట్రల్ రైల్వే బోర్డు సివిల్ ఇంజినీర్ సచిన్, డీఎంవో కవిత, నియోజక వర్గ ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

రైతులను అడ్డుకోవడంపై నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : రైతులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారని తెలిపారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, నాయకులు విలాస్ బుక్క రమేశ్, శంకర్, అనంత్‌రావు, దుర్గె, అజీం పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 26: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ధన్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లు, దవాఖానలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రజని, అడ్వొకేట్, సామాజిక కార్యకర్త నిర్మల, డీపీఆర్వో విష్ణువర్ధన్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, తదితరులు ఉన్నారు.

కొనోకార్బస్ వృక్షాలను తొలగించాలి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 26 : నిర్మల్ మున్సిపాలిటీలో రోడ్డు డివైడర్‌లో నాటిన కొనోకార్బస్ వృక్షాలను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ ఏబీవీపీ విద్యార్థులు కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. ఇక్కడ నాయకులు శశి, సన్ని, సాయిచరణ్, శశాంక్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 26 : అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను చురుగ్గా కొనసాగించాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి ఉపాధిహామీ పథకం కింద రూ.116.50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 26: నిర్మల్ పట్టణంలోని విజయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, జిల్లా ఒలింపిక్ కమిటీ చైర్మన్ అయ్యన్న గారి భూమయ్య, కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీరం విజయలక్ష్మి, ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బర్డ్ ఫీడింగ్‌పై అవగాహన

కుంటాల, ఫిబ్రవరి, 26 : అంతరించిపోతున్న పక్షిజాతులను ఎలా కాపాడుకోవాలి వాటి వల్ల ఉపయోగాలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆదర్శ, కల్లూరులోని కేజీబీవీల్లో సామాజిక కార్యకర్త జక్కుల శంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముత్యం, ఉపాధ్యాయులు రతన్ కుమార్, సగ్గం గంగాధర్, లక్ష్మణ్, ధర్మాజీ, భోజన్న పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ వైద్యుడికి ఘన సన్మానం

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 26 : ఇటీవల గోపాలకృష్ణ జిల్లా ఉత్తమ వైద్యుడిగా అత్యున్నత పురస్కారం పొందిన మస్కాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ వేణుగోపాల కృష్ణను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సోమవారం ఆయన స్వగ్రామానికి రాగా గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. శివాలయ బ్రహ్మోత్సవాల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగమ్మ, చిలుకూరి మల్లయ్య, డా.నీలిమ, సుహాసిని, దొనికెని దయానంద్, బాశెట్టి నర్సయ్య, అడిదెల మల్లేశం, విజేందర్, వెంకట్రాములు, శివ, మదు, నితిన్, మహేశ్, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.